

## ప్రపంచ రికార్డును అధిగమించిన

## పోర్చుగల్ శాంతా మార్చ్

ప్రపంచ రికార్డు సృష్టించడంలో ఒక్కొక్కరిదీ ఒక్కో స్టయిల్. ఏదో ఒక పని చేసి రికార్డుల్లోకి ఎక్కాలని చాలా మంది ప్రయత్నిస్తారు. అయితే ఓ మంచి పని చేసి ప్రపంచ రికార్డులోకి ఎక్కాలనే ప్రయత్నమే గొప్పది!

రాబోయే క్రిస్మస్ సందర్భంగా పోర్చుగల్ సిటీలో సుమారు 14వేల మంది సాంతాక్రజ్ డ్రస్ వేసుకొని మార్చ్ ఫాస్ట్ చేశారు. ఇన్ని వేల మంది ఈ విధంగా సాంతాక్రజ్‌ల రూపంలో మార్చ్ ఫాస్ట్ చేయడం ఇదే మొదటిసారి. గత సంవత్సరం సదరన్ ఐర్లాండ్‌లోని డెర్రి సిటీలో సుమారు 13వేల మంది ఈ విధంగా మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ప్రపంచ రికార్డుకెక్కితే ఇప్పుడు పోర్చుగల్‌లో జరిగిన మార్చ్ ఫాస్ట్ ఈ రికార్డును అధిగమించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు....

14వేల మంది ప్రజలు ఎరుపు, తెలుపు రంగు టోపీలు, జాకెట్లు ధరించి నగర వీధులలో ఆడుతూ పాడుతూ మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఇందులో స్త్రీలు, పురుషులు, పిల్లలు అందరూ పాల్గొనడం విశేషం. మధ్యాహ్నం ప్రారంభమయిన ఈ కార్యక్రమం బాగా పొద్దుపోయే వరకూ సాగింది. ఈ సంఘటనకు సంబంధించి ఆర్గనైజర్లు మాట్లాడుతూ.... జనం గుమిగూడి ప్రదర్శనలు నిర్వహించడం పెద్ద విశేషం కాకపోయినా ఇది ఓ సామాజిక కార్యక్రమంగా నిర్వహించడం విశేషం అన్నారు. ఇందులో పాల్గొన్న సాంతాలు అందరూ ఒక్కో యూరోను చిన్న పిల్లల బహుమతుల కొనుగోలు కోసం ఇచ్చారని వారు చెప్పారు.

మొదట 17,400మంది ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకున్నప్పటికీ చివరకి 14వేల మంది మాత్రమే హాజరయ్యారని నిర్వాహకులు వివరించారు.

*

## 'సరసి' కత

వైశంపాయనుడికి పెళ్లయి పాతికేళ్లయినా అత్తారింటి నుంచీ, బావమరుదుల్నించీ ఇంకా ఏవో ఆశిస్తూనే వుంటాడు. ఆ మధ్య సంక్రాంతి పండక్కి చిన్న బావమరిదింటికి వెళ్లాడు వైశంపాయనుడు భార్య సుబ్బాయమ్మ గారితో కలిసి. ఇద్దరినీ ఆదరించి, బట్టలు పెట్టి, సకల సత్కారాలూ చేశాడు బావమరిది భగీరథుడు.

అయితే అవి చాలనట్టు అతగాడు తొడుక్కున్న కొత్త చెప్పుల మీద పడింది వైశంపాయనుడి కన్ను. 'బావున్నాయి' అంటే చాలు ఇచ్చేసే టైపు భగీరథుడు. అయితే తన తమ్ముణ్ణి బుట్టలో వేసినట్టు తెలిస్తే సుబ్బాయమ్మ చంపేస్తుందని భయపడ్డాడు వైశంపాయనుడు. పండగ వెళ్లేక అక్కాబావలకి సెండాఫ్ చెప్పడానికి రైల్వే స్టేషనుకు వచ్చాడు భగీరథుడు. ఇంతలో, అతడి చెప్పులు కొట్టెయ్యడానికో ఐడియా వెలిగింది వైశంపాయనుడి బుర్రలో.

రైలు వచ్చి ఆగింది. హడావుడిగా ఎక్కబోయిన వైశంపాయనుడి కుడికాలు చెప్పు

# చెప్పు కథ



జారి రైలుకీ, ప్లాట్‌ఫారమ్‌కీ మధ్య పట్టాల పక్కన పడిపోయింది! ''అయ్యో'' అన్నారందరూ. ''చెప్పుల్లేకుండా ఎలా వెడతావు బావా?'' అన్నాడు భగీరథుడు ఆందోళనగా. ''పోనీ ఓ పని చెయ్ భగీ! నీ చెప్పులు నే వేసుకెడతా. రైలు వెళ్లాక పట్టాల మీద పడిన ఆ చెప్పూ, ఇదిగో ఈ చెప్పూ నువ్వేసుకెళ్లిపో!'' అంటూ తన ఎడమ కాలి చెప్పును ప్లాట్‌ఫారం మీదకు గిరాటేశాడు వైశంపాయనుడు. బావ సమయస్ఫూర్తికి భగీరథుడు అబ్బుర పడుతూ, తన కాలి చెప్పుల్ని తీసి బావకిచ్చేశాడు. అయితే సుబ్బాయమ్మ గారికి డౌటొచ్చేసింది మొగుడి నిర్వాకం మీద. ''ఆ ముష్టి చెప్పులు నీ కెందుకు, ఇంద, మంచివి కొనుక్కో నాన్నా!'' అంటూ తన హేండ్ బ్యాగ్‌లోంచి ఐదు వందల నోటు తీసి, తమ్ముడి జేబులో కుక్కేసింది సుబ్బాయమ్మగారు! బండి కదలిపోయింది. చెప్పుతో కొట్టేవు కదే, ఛ!' అనుకున్నాడు వైశంపాయనుడు, పైకి ఏమాత్రం కిక్కురుమనకుండా.

*